క్లుప్తంగా

నీటి సరఫరా వేళల్లో మార్పులు

తుని: పట్టణంలోని మంచినీటి సరఫరాలో వేళల్లో మార్పులు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శనివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సూధారాణి ఆదేశాల మేరకు ఆదివారం నుంచి పట్టణమంతా ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకూ మంచినీటి సరఫరా చేస్తామన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న టైలర్స్ కాలనీ, రామకృష్ణ కాలనీ, పండా వీధుల్లో ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ మంచినీరు సరఫరా చేస్తామన్నారు. కార్తికమాసం ముగిసే వరకూ ఈ వేళలు కొనసాగుతాయని తెలిపారు. సాయంత్రం నీటి సరఫరాలో ఎటువంటి మార్పులు లేవన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన రిమ్‌జిమ్ వేడుకలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో ఐదు రోజులుగా జరుగుతున్న రిమ్‌జిమ్ వేడుకలు శనివారంతో ఘనంగా ముగిశాయి. శ్రీప్రకాష్ తుని, పాయకరావుపేట, అన్నవరం బ్రాంచుల విద్యార్థులు 4,500 మందికి సాహిత్యం, సంగీతం, ఆటలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ తదితర అంశాలపై జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్.చంద్ర శేఖర్ ఆజాద్, పాయకరావుపేట ఎస్సై పి.అప్పలరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

అలరించిన శ్రీకృష్ణుని లీలలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన శ్రీకృష్ణుని లీలలు వీధి నాటకం స్థానికులను అలరించింది. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావు పేట, మంగాయ్యమ్మ పేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో శ్రీకృష్ణుడిగా వల్లు శివరాజ్, చిన గోపాలుడిగా మోరుకుర్తి వీరబాబు, గోపికలుగా యడవిల్లి శివ, నల్లా చరణ్, రాచపల్లి సత్తిబాబు, ఫక్కుర్తి శివ నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మెకప్ – డ్రెస్సింగ్ చేశారు. తొలుత గౌరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమరవీరుల సంస్మరణ ర్యాలీ

జగ్గంపేట: అమరవీరుల సంస్మరణ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో శనివారం సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర నాయకురాలు రంగవల్లి అక్క వర్ధంతిని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ట్రావెలర్స్ బంగ్లా నుంచి పంచాయతీ ఆఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. అమరులకు జోహార్లు, భూమికోసం, భుక్తి కోసం పోరాటాలు వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ జగ్గంపేట మండలంలోని మిగులు భూములు, దేవదాయ, భూదానం భూములు పెత్తందార్ల చేతిలోనే ఉన్నాయన్నారు. ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు పాల్గొన్నారు.

వెలుగుల పండగకు వేళాయె..

- గ్రామాల్లో దీపావళి సందడి
- జోరుగా బాణసంచా సామగ్రి విక్రయాలు


ఏలేశ్వరంలో బాణసంచా సామగ్రి విక్రయాలు

ఏలేశ్వరం/గోకవరం/కిర్లంపూడి: గ్రామాల్లో దీపావళి పండగ సందడి నెలకొంది. తమ జీవితాల్లో వెలుగులు నింపే దీపావళిని ఆదివారం వైభవంగా జరపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. పండగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం యర్రవరం రోడ్డులోని లింగవరం కాలనీ సమీపంలో ప్రభుత్వ అనుమతితో 18, యర్రవరంలో రెండు చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీపావళికి ఒక్కరోజే ఉండడంతో శనివారం అమ్మకాలు జోరందుకున్నాయి. పిల్లలు, పెద్దలు వివిధ రకాల బాణసంచా సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు అప్రమత్తమయ్యారు. దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా వాటర్, ఇసుక, తదతర వాటిని ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ముఖద్వారం కావడంతో ఏటా ఏలేశ్వరంలో వేలాది మంది బాణసంచా కొనుగోలు చేస్తారు.

పెరిగిన ధరలు

దీపావళి సామగ్రి ధరలు ఆకాశనంటుతున్నాయి. బాణసంచా ధరలు ఈ ఏడాది భారీగా పెరగడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. సంప్రదాయ ప్రకారం పండగ జరుపుకోవాల్సి ఉండడం, పిల్లల పోరు పడలేక నామమాత్రంగా సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఏలేశ్వరంలో బాణసంచా దుకాణాలకు ఎస్సై జిసతీష్, తహసీల్దార్ చిన్నారావు తనిఖీ చేశారు. అగ్నిప్రమాదాలు జరగకుండా, జరిగితే తీసుకోవల్సిన జాగ్రత్తలను దుకాణదారులకు వివరించారు. గోకవరం సంత మార్కెట్‌లో 14 మందుగుండు సామగ్రి షాపులకు అధికారులు లైసెన్సులు మంజూరు చేశారు. శనివారం దీపావళి సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి.

కిర్లంపూడి మండలంలో..

బాణసంచా సామగ్రి విక్రయాలకు కిర్లంపూడి సంత మార్కెట్ యార్డులో 6 దుకాణాలు, రాజుపాలెంలో మరో దుకాణం ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి.

ఐదు బాణసంచా షాపులకు అనుమతులు

తొండంగి: దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో ఐదు బాణసంచా షాపులకు అనుమతి ఇచ్చినట్టు తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పెరుమాళ్లపురంలో రెండు, దానవాయిపేటలో రెండు, ఎ.కొత్తపల్లిలో ఒకటి చొప్పున మొత్తం ఐదు షాపులకు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం నుంచి అనుమతులు వచ్చాయని వివరించారు.

మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి


ఏలేశ్వరంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు

ఏలేశ్వరం: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. ఆజాద్ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ డే నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడపా దుర్గారావు, ఆకుల దాసు, బంటుపల్లి శివ పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డి.నారాయణ రావు, ప్రతాప్, అనిల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ


ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న విశ్రాంత వైద్యాధికారి రమణ

ప్రత్తిపాడు: గ్రామంలోని నిరుపేద విద్యార్థులకు శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. స్థానిక షిర్డీసాయి జ్యూలయరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చిన పౌష్టికాహార కిట్లను ఏలేశ్వరం సీహెచ్‌సీ విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ, ధనలక్ష్మి దంపతులు విద్యార్థులకు అందజేశారు. పేదలకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను విశ్రాంత వైద్యాధికారి రమణ కొనియాడారు. కార్యక్రమంలో శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పి.శ్రీనివాసరెడ్డి, మండల ఫొటోగ్రాఫర్స్ సంఘ అధ్యక్షుడు సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొండేసి సత్యానందం, భేరి రాంబాబు, కె.జగదీశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


కోటనందూరులో బాణసంచా షాపులను పరిశీలిస్తున్న ఎస్సై శంకర్, తహసీల్దార్ కుశరాజు

కోటనందూరు: బాణసంచా విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై శంకర్ వ్యాపారులను హెచ్చరించారు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయానికి స్థానిక తాండవ బ్రిడ్జి పక్కనే అనుమతినిచ్చిన ప్రాంతాన్ని శనివారం తహసీల్దార్ కుశరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద హైడ్రోజన్ సిలిండర్లు, నీరు, ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదాలకు తావు లేకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

గండేపల్లి: నిబంధనలు అతిక్రమించి మందుగుండు సామగ్రి అమ్మితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని జగ్గంపేట సీఐ.బి.సూర్యఅప్పారావు హెచ్చరించారు. మండలంలోని జెడ్.రాగంపేటలో ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రి దుకాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అనుమతులు లేని షాపుల్లో అమ్మకాలను తక్షణమే నిలిపివేయించారు. షాపుల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై గణేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

గోకవరం: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా ఆర్.హరనాథ్, ప్రధాన కార్యదర్శిగా పీవీవీఎస్ఆర్ త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.కుమార్, సహాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, ఎస్ సులోచన, ట్రెజరర్‌గా టీవీవీఆర్ఎస్ నారాయణ రావు, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ నూతన అధ్యక్షుడు హరనాథ్ మాట్లాడుతూ యూటీఎఫ్ బలోపేతంతో పాటు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు ఎస్.అనిల్‌కుమార్, ఈ.శ్రీమణి, ప్రేమ్‌కుమార్, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'


లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న నాయకులు

గోకవరం: స్థానిక సచివాలయం 1, 2 పరిధిలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, బద్దిరెడ్డి మెహర్‌బాబా, నరాలశెట్టి నర్సయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

రత్నగిరిపై శంకరునికి సహస్ర లింగార్చన


రత్నగిరిపై శివలింగాలకు మహా రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

అన్నవరం: మాసశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రత్నగిరిపై ఈశ్వరునికి పంచామృతాలతో సహస్ర లింగార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. దర్బారు మండపంలో సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ మూర్తుల చెంత మట్టితో తయారు చేసిన 1,133 శివలింగాలకు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, కొబ్బరి నీరుతో అభిషేకం చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా రుద్రహోమం

రత్నగిరిపై ఆయుష్యహోమ మండపంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు రుద్రహోమం నిర్వహించారు. శివునికి రుద్ర హోమం నిర్వహించిన కారణంగా సత్యదేవునికి లక్ష్మీ ప్రయోక్త ఆయుష్యహోమం నిర్వహించలేదు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు హోమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు


ఫ్యాన్సీడ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రంగం' యువజనోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల్లోని ఎల్‌కేజీ నుంచి ఆరో తరగతి వరకూ చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొని అహుతులను అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు పూర్ణశ్యామల, రామలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ గణేష్, యూత్ యాక్టివిటీస్ చైర్మన్ డాక్టర్ పి.ప్రసాద్, రోటరీ, రోటరాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పారాయణ పఠనం

ఏలేశ్వరం: స్థానిక మార్కెట్ వీధిలోని రూపులమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం పలు పారాయణలు పఠించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో శివ స్తోత్రాలు, లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి కటకం కిరిటీ, నాయకులు ఏడీవీ ప్రసాద్, మజ్జి సత్యనారాయణ, ఉడతల రమణారావు, సంఘ మహిళా సభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారు శతమానాల చోరీ

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో శనివారం మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి సుమారు 35 గ్రాముల బంగారం పుస్తుల తాడును చోరీ చేశాడు. వివరాల్లోకి వెళితే.. రాజుపాలేనికి చెందిన మళ్ల లక్ష్మీపార్వతి మరో మహిళతో కలిసి కిర్లంపూడి నుంచి పెద్దాపురం మండలం చిన్నతిరుపతిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం తెల్లవారుజామున కాలినడకన వెళుతున్నారు. రాజుపాలెం ఊరి శివారుకు వెళ్లే సరికి గుర్తుతెలియని వ్యక్తి వెనక నుంచి వచ్చి లక్ష్మీపార్వతి మెడలో ఉన్న శతమానాల తాడును లాక్కొని పంట పొలాల్లోకి పారిపోయాడు. బాధితురాలు తన కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయగా పొలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా దొంగ కనబడలేదు. దీంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గోకవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ కె.ప్రియదర్శిని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమకారుల సన్మానసభ, కవి సమ్మేళనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, పాఠకులు ఈ వారోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.